క్లుప్తంగా...

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: న్యూ ఇయర్ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 12 బృందాలు 12 చోట్ల డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 32 మంది, పంజగుట్ట 49 మంది, జూబ్లీహిల్స్ 65 మంది, ఎస్సార్‌నగర్‌లో 64 మంది మొత్తం 216 మంది పట్టుబడగా వీరందరికీ జరిమానా విధించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా డ్రంకన్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఇదిలా ఉండగా పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లో ఓ యువకుడికి 550 ఎంజీ నమోదైంది.



బంజారాహిల్స్ రోడ్డునంబర్-2లో బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ



పూజల్లో దీక్షాపరులు, భక్తులు

వెంగళరావునగర్ : ఈస్ట్ రహమత్‌నగర్‌లో చంద్రప్రకాశ్ గురుస్వామి సన్నిధానంలో బుధవారం అయ్యప్ప మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు చంద్రప్రకాశ్, శివప్రసాద్, రాజశేఖర్, జనార్దన్‌చారి, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్‌చారి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన పబ్‌పై కేసు

బంజారాహిల్స్: న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి భారీ శబ్దంతో డీజే ఏర్పాటుచేసిన జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-10లోని బాబీలాన్ పబ్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పబ్‌లో అధికంగా సౌండ్ ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని సౌండ్ సిస్టం సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

పబ్‌లు, క్లబ్‌లపై యాంటీ నార్కోటిక్ టీంల ప్రత్యేక దృష్టి



జూబ్లీహిల్స్‌లో యాంటీ నార్కోటిక్ టీం

బంజారాహిల్స్: నూతన సంవత్సరం సందర్భంగా గంజాయి, డ్రగ్స్ వినియోగించకుండా ఉండేందుకు యాంటీ నార్కోటిక్ టీమ్‌లు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని పబ్‌లు, క్లబ్‌లపై మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామువరకు ప్రత్యేక దృష్టి పెట్టారు. అనుమానితుల కదలికలను గమనిస్తూ మత్తు పదార్థాల వినియోగం జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రేమ, అనురాగాలతో జీవించాలి

లిబర్టీ: మాతృ ప్రేమతో పరిపాలన సాగించాలని, అప్పుడే రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉంటారని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కేబీ.శ్రీధర్ అన్నారు. లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో బుధవారం సత్‌సంగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో పుష్పాంలి, నందికొండలరావు, బాలాజీ, వేణు పాల్గొన్నారు.

ఆలయాలు కిటకిట

న్యూ ఇయర్ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తుల రాక

- ఉదయం నుంచే దర్శనానికి క్యూ
- పెద్దమ్మ, జగన్నాథ, టీటీడీ శ్రీవారి టెంపుల్స్‌లో పూజలు



బంజారాహిల్స్‌లోని జగన్నాథ మందిరంలో భక్తుల రద్దీ





బంజారాహిల్స్: న్యూ ఇయర్ సందర్భంగా బుధవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి.. బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని జగన్నాథ మందిరం, జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వారి ఆలయాలకు వేకువజాము నుంచే నగర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలతో పాటు పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఆలయాలకు భక్తులు తరలిరావడంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి.



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో..



జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలో భక్తులు



బంజారాహిల్స్ రోడ్ నంబర్-10 తెలంగాణ భవన్‌రోడ్డులో వాహనాల రద్దీ

కమీషన్ల ప్రభుత్వంగా రేవంత్ రెడ్డి సర్కారు

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ: కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ..ఢిల్లీకి మూటలు పంపుతూ కమీషన్ల ప్రభుత్వంగా రేవంత్ రెడ్డి సర్కారు మారిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీ విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, 16 లక్షల75వేల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద రాష్ట్రస్థాయి సదస్సు, భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం తెచ్చిన అప్పులు రూ.80 వేల కోట్లయితే, లక్ష కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో కాంట్రాక్టర్లకు ఎంత చెల్లించారు..? ఇతర బిల్లులు ఎన్ని చెల్లించారో..? శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీల వెంకటేశ్, తంగెళ్లమూడి నందగోపాల్, నిమ్మల వీరన్న, రాందేవ్ మోదీ, ఉదయ్ నేత, రాజు పాల్గొన్నారు.

ఘనంగా మహర్ విజయ్ దివస్

లిబర్టీ: మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం మహర్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జీ ప్రకాశ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.శంకర్, వీరన్న, జి.కిషన్, జి.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కళలపై కూడా దృష్టిసారించాలి



డ్యాన్స్ స్టూడియోను ప్రారంభిస్తున్న అనూహ్యారెడ్డి

శ్రీనగర్‌కాలనీ : విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతో పాటుగా డ్యాన్స్ లాంటి కళలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని టీవీ సీరియల్స్ నిర్మాత, కోవిద సర్వోదయ ఫౌండేషన్ చైర్‌పర్సన్ అనూహ్యారెడ్డి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ హైమావతినగర్‌లో గూడూరు వస్‌రాజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వింగ్స్ ఆఫ్ ఫైర్ డ్యాన్స్ స్టూడియోను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాస్టర్ డ్యాన్సర్ వస్‌రాజ్‌రెడ్డి చిన్నతనంలోనే డ్యాన్స్ క్లాస్ స్థాపించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరు చెన్నారెడ్డి, వస్‌రాజ్‌రెడ్డి తల్లిదండ్రులు జీ శ్రీధర్‌రెడ్డి, కల్యాణిరెడ్డితో పాటు డాక్టర్ జి.విజయలక్ష్మి, డి.మంజులారెడ్డి, సీహెచ్.శోభారెడ్డి, లిషా వంశీరెడ్డి, డి.ప్రత్యక్షనందరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

లిబర్టీ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆప్ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అన్సారీ, విజయ్ మల్లంగి, నర్సింగ్‌యమునాగౌడ్, డాక్టర్ లాక్ష్యనాయుడు, అప్పసలాం, జావీద్ షరీఫ్, సుధారాణి, వైశాలి, ఆజాంబేగ్, రామస్‌స్వామి, సురేశ్, ధర్మేందర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్



న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న జేఐసీ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా కళాకారుల ఆటపాటలు ఉర్రూతలూగించాయి. అనంతరం జేఐసీ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు సిద్దార్థ ఫైన్ జ్యువెలర్స్ అధినేత వేమూరి కృష్ణప్రసాద్‌తో కలిసి న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. ఈ వేడుకలను జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-10లోని సిద్దార్థ ఫైన్ జ్యువెలర్స్ స్పాన్సర్ చేసింది. ఈ సందర్భంగా సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఏడాది అంటే 365 రోజులు మాత్రమే కాదని, 365 అవకాశాలుగా స్వీకరించాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.

ఎఫ్ఎన్‌సీసీలో ..

ఫిలింనగర్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ రామారావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆది శేషగిరిరావు, కాజా సూర్యనారాయణ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ

నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద బుధవారం సందడి కనిపించింది. ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలతో పాటు పలువురు అధికారులు వారికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

–జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ జోన్ల బృందం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు



కేటీఆర్‌తో బోరబండ బీఆర్ఎస్ నాయకులు



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ భారతీనాయక్

గోల్డెన్ టెంపుల్‌లో వైభవంగా శుభారంభం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బంజారాహిల్స్: నూతన సంవత్సరం సందర్భంగా రోడ్డునంబర్-12లోని ఎన్‌బీటీ నగర్ హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో బుధవారం శుభారంభం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీరాధాకృష్ణులు, భూదేవి శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్, కార్పొరేటర్

వెంగళరావునగర్ : మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కేలండర్‌ను కాలనీలోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో మధురానగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ జీ శ్రీనివాస్‌వర్మ, స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మనోహర్‌రావుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.